ప్రజాశక్తి

ఆదివారం 11 ఫిబ్రవరి 2024 | 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

పాఠం నేర్వని కార్పొరేషన్

- వెంటాడుతున్న నీటి కాలుష్యం
- వాంతులు, విరోచనాలతో ఇద్దరు మృతి
- హెచ్చరికలు చేసి చేతులు దులుపుకొన్న అధికారులు
- నిర్లక్ష్యం చేస్తే 2018 ఘటనలు పునరావృత్తం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులోని వివిధ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో కాలుష్యం వెంటాడుతోంది. ఆదిలో నిర్లక్ష్యం వల్ల పెద్దసంఖ్యలో మరణాలను నమోదు చేసుకున్న పరిస్థితులు గుంటూరులో 2018 మార్చిలో చోటుచేసుకున్నాయి. అప్పట్లో ఉన్న కమిషనర్ చల్లా అనూరాధ, అప్పటి ఇంజినీరింగ్ అధికారులు నీటి కాలుష్యాన్ని అంగీకరించక మొదట్లో ఫుడ్ పాయిజనింగ్ అని చేతులు దులుపుకోవడం వల్ల 24 మంది బలయ్యారు. అప్పట్లో పాతగుంటూరు, ఆనందపేట, సంగడిగుంట తదితర ప్రాంతాల్లో తాగునీటి పైపు లైన్లలోకి డ్రెయినేజి నీరు కలిసి వందలాదిమంది అస్వస్థతకు గురయ్యారు. 24 మందిప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు వేసవి ప్రారంభం కాకుండానే అప్పటి పరిస్థితులు పునరావృత్తం అవుతున్నాయి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రజల ప్రాణాలకు ముప్పు తప్పదనే సంకేతాలు కన్పిస్తున్నాయి. నీటి కాలుష్యం వల్ల తీవ్రమైన కడుపునొప్పితో వాంతులు, విరోచనాలు వల్ల సంభవించే నిస్సత్తువ ప్రభావం శరీరంలోని వివిధ అవయావాలపై పడుతోంది. ఏ అవయవం విఫలమైనా మరణం సంభవించే అవకాశం ఉంటుంది.

కానీ పాలకులు, ఉన్నతాధికారులు ఎక్కువ విరోచనాలు, వాంతుల వల్ల సంభవించే మరణాలను ఇతర కారణాలతో ముడిపెట్టి తప్పించుకోవడం పరిపాటిగా మారింది. ఇదే రీతిలో 2018లో కూడా అధికారులు, అప్పటి అధికార పార్టీ నాయకులు నిర్లక్షంగా మాట్లాడి చివరికి 24 మంది మృతి చెందిన తరువాత కమిషనర్‌ను బదిలీ చేసి ఇంజినీరింగ్ విభాగం అధికారులను మూకుమ్మడిగా అప్పటి ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇప్పుడు కూడా పాలకులు, అధికారుల ఈ ఘటనను తేలికగా తీసుకుంటున్నట్టు కనిపిస్తోంది. నగరంలోని కేవలం ఒక్క ప్రాంతంలో ఒకరిద్దరికి మాత్రమే నీరు కలుషిత సమస్య రాలేదు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకే రోజు 21 మంది చేరగా అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రైవేటు ఆస్పత్రులకు కూడా పెద్దసంఖ్యలో బాధితులు వెళ్లారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే

2లో

ఆదుకుంటాం : మంత్రి రజిని

జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని శనివారం రాత్రి పరామర్శించారు. బాధితులను ఆదుకుంటామని, నీటి కాలుష్యం నివారణకు చర్యలు తీసుకుంటామని అన్నారు. బాధితులకు మెరుగైన చికిత్సలు అందించి క్షేమంగా ఇంటికి పంపాలని వైద్యులను ఆదేశించారు. తొలుత మంత్రి రాగానే బిజెపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

జిఎంసి నిర్లక్ష్యం వల్లే డయేరియా

బాధితులను పరామర్శించిన సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో డయేరి యా వ్యాప్తికి నగర పాలక సంస్థ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని సిపిఎం నగర కార్యదర్శి నళినీ కాంత్, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో చికిత్స పొందుతున్న బాధితులను సిపిఎం, సిపిఐ బృందం పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిపై సూపరింటెండెంట్‌తో మాట్లాడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డయేరియా వ్యాప్తితో సంగడిగుంట, శారదా కాలనీ, శ్రీనగర్, ముత్యాలరెడ్డి నగర్, సంగడిగుంట ఏరియాలతో పాటు నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుండి కలుషిత నీటి కారణంగా ఆసుపత్రిలో పెద్ద సంఖ్యలో చేరుతున్నారని తెలిపారు. శారదా కాలనీకి చెందిన పద్మ అనే మహిళ చనిపోయిందని, కొద్దిమంది ఐసీయూలో ఉన్నారని తెలిపారు. గుంటూరు నగరంలో ఏ ప్రభుత్వం వచ్చినా పరిశుభ్రమైన తాగునీరు ప్రజలకు అందివ్వలేకపోవటం సిగ్గుచేటని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో కలుషిత నీటి కారణంగా 12మంది చనిపోయారని, అయినా ప్రభుత్వాలు ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని, ఫలితంగానే మళ్లీ ఇప్పుడు పునరావృతం అవుతుందన్నారు. గుంటూరు నగరంలో పెద్ద సంఖ్యలో డయేరియా బాధితులుగా ఆసుపత్రుల్లో చేరుతున్నా, బాధిత కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉన్నారు

2లో

తాగునీటిపై ఆందోళన వద్దు

ప్రజాశక్తి-గుంటూరు

శారదా కాలనీలో పర్యటించి, బాధితులతో మాట్లాడుతున్న మేయర్, కమిషనర్ తదితరులు

గుంటూరు నగర ప్రజలు తాగునీటి సరఫరాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిఎంసి శుద్ధమైన తాగునీటిని అందించడంలో నిబంధనల మేరకు చర్యలన్నీ తీసుకుంటుందని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. శారదా కాలనీ, శ్రీనగర్ ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యానికి గురయ్యారని తెలిసిన వెంటనే నగర మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారదకాలని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో, ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న 19 మంది బాదితులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని సూపరిండెంట్‌ను ఆదేశించామన్నారు. ఇప్పటికే 3 రోజుల క్రితం సంగడిగుంట తిరుమలచారి కాలనిలో జరిగిన సంఘటనపై తక్షణం స్పందించి నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పరిసర ప్రాంతాల్లో డోర్ టు డోర్ తాగునీటి నమూనా పరీక్షలు, క్లోరిన్ పరీక్షలు ప్రభుత్వ మెడికల్ కాలేజిలోని రీజినల్ ల్యాబ్ వారిచే పరీక్షించామన్నారు. తాగునీటిలో క్లోరిన్ కూడా తగిన మోతాదులో ఉన్నట్లు నిర్ధారణైందని, ప్రజారోగ్య అధికారులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి ఆరోగ్య సర్వే చేశారని, అందులో ఎవ్వరికీ డయేరియా ప్రభావం లేదని రిపోర్ట్ వచ్చిందని తెలిపారు. శారదాకాలనికి చెందిన పద్మ మృతి డయోరివా వల్ల కాదని తెలిసిందని, పోస్ట్‌మార్టం కూడా చేపట్టాలని ఆదేశించామని అన్నారు. శారదాకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ చేశామన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నగరంలోని ప్రతి రిజర్వాయర్ పరిధిలో తాగునీటి సరఫరా జరిగే సమయంలో ఎమినిటి కార్యదర్శుల ద్వారా ఫస్ట్ పాయింట్ నుండి టేయిలేండ్ వరకు క్లోరిన్ శ్యాంపిల్స్ సేకరించాలని ఆదేశించామన్నారు. శారదా కాలనీ రిజర్వాయర్ షెడ్యుల్ మేరకు జనవరి 20న క్లీన్ చేయించామని, అన్ని రిజర్వాయర్లు కూడా నిర్దేశిత గడువు మేరకు క్లీన్ చేయించామని చెప్పారు.

యడ్లపాడులో జెవివి చెకుముకి సైన్స్ సంబరాలు

రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన విద్యార్థులు - బహుముఖ కార్యక్రమాలతో నూతనోత్సాహం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

జనవిజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో మండల కేంద్రమూన యడ్లపాడులోని నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో చెకుముకి సైన్సు సంబరాలు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుండి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తరలివచ్చారు. తొలుత జాతీయ పతాకాన్ని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించగా జనవిజ్ఞాన వేదిక జెండాను పల్నాడు జిల్లా అధ్యక్షులు డి.బుజ్జిబాబు ఆవిష్కరించారు. అనంతరం నారాయణ (చిలకలూరిపేట) విద్యార్థులు హైస్కూల్ (యడ్లపాడు), మోడర్న్ హైస్కూల్ సాంస్కృతిక ప్రదర్శనలతో

2లో

ఇస్రో ప్రదర్శన వద్ద విద్యార్థులు

కొండవీడు కోటపై పండగ

పర్యాటకులకు కోసం భారీగా ఏర్పాట్లు

నిరంతరాయంగా సాంస్కృతిక కార్యక్రమాఇలు

8లో

బాధితులకు మెరుగైన వైద్యం అందజేయాలి : వల్లభనేని బాలశౌరి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

కొన్ని రోజులుగా మున్సిపాలిటీ నుంచి కలుషిత నీరు సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోలేదని మచిలీపట్నం ఎంపి వి. బాలశౌరి విమర్శించారు. జిజిహెచ్‌లో శనివారం ఆయన డయేరియా బాధితులను పరామర్శించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే పద్మ అనే మహిళ మతిచెందిందన్నారు. జనసేన పార్టీ బాధితులకు అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

కమిషనర్ పరామర్శ

ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాధితులను నగర పాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి అధికారులను కోరారు.

టిడిపి,జనసేన నిరసన

రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజని గుంటూరులో ఉన్నా నగరంలోని ఇటువంటి సంఘటన జరగటం బాధాకరమని, ప్రజలకు కనీసం స్వచ్ఛమైన తాగునీరు అందలించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని టిడిపి, జనసేన నాయకులు ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని టిడిపి నాయకులు కనపర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నిరసనలో జనసేన నాయకులు నెరెళ్లసురేష్, ఆళ్ల హరి పాల్గొన్నారు.

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వండి : రవీంద్ర

సంగడిగుంట, శ్రీనగర్ వివిధ ప్రాంతాల్లో ప్రజలు కలుషిత నీరు తాగడం వల్ల 30 మంది అనారోగ్య బారిన పడి చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 50 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇచ్చి న్యాయం చేయాలని టిడిపి పశ్చిమ ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించి అధికారులతో మాట్లాడారు. అధికారుల వైఫల్యం వల్లే డయేరియా ప్రభలిందని టిడిపి తూర్పు నియోజకవర్గం ఇన్‌ఛార్జి నశీర్ అహ్మద్‌వ అన్నారు. ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు. అనంతరం కమిషనర్‌ను ఆయన నిలదీశారు. ముందస్తుజాగ్రత్తలు లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు.

కాంగ్రెస్ నేతల పరామర్శ

మేయర్ కావటి మనోహర్ నాయుడు గుంటూరు నగరాన్ని చేతిలో పెట్టుకొని అధికారులను డమ్మీగా మార్చి ప్రజల సౌకర్యాలను నిర్లక్ష్యం చేస్తున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షులు ఉస్మాన్ విమర్శించారు. డయేరియా వల్ల ఇద్దరు చనిపోవడం, 30 మంది అస్వస్థతకు గురయినా మేయర్ ఈ ఘటనను చాలాతేలిక భావంతో మాట్లాడటం సరికాదన్నారు. బాధితేలపే పిసిసి ప్రధాన కార్యదర్శి మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నగర ఉపాధ్యక్షులు చెన్నం శెట్టి సాంబశివరావు, సయ్యద్ జానీ గోల్డ్, మీరు మెహబూబలి పరామర్శించారు.

మినరల్ వాటర్‌లో పురుగులు

ప్రజాశక్తి-తాడేపల్లి : పెనుమాక పంచాయతీ కార్యాలయం పక్కకున్న మినరల్ వాటన్ ప్లాంటు కొనుగోలు చేస్తున్న తాగునీటిలో పురుగులు దర్శనమిస్తున్నాయి. వాటర్ ప్లాంట్ నుంచి 20 లీటర్ల క్యానుల్లో పట్టిన మినరల్ వాటర్‌లో పురుగులు రావడం చూసిన వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే ప్లాంట్‌లో వాటర్‌లో పురుగులు రావడాన్ని గమనించిన స్థానికులు నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. ప్లాంట్ యజమాని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు చేయడంతో పాటు పెనుమాక పురుగులు వచ్చిన మినరల్ ప్లాంట్‌లో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పాఠం నేర్వని కార్పొరేషన్

(మొదటి పేజీ తరువాయి)

వారు, మెడికల్ షాపులల్లో మందులు తెచ్చుకుని ఇళ్ల వద్ద చికిత్సలు పొందే వారు, ఆర్‌ఎంపిల వద్ద చికిత్సలు చేయించుకునే వారిని కూడా పరిశీలించాల్సిన అవసరం అధికారులకు ఉంది.

గుంటూరులోని వివిధప్రాంతాల్లో తాగునీరు కలుషితంపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొరవడింది. పులిచింతల నుంచి నీరు కలుషితమై వస్తోందని, ఉండవల్లి పంపింగ్ సెంటర్‌లో పూర్తిస్థాయిలో క్లీనింగ్ కావడం లేదని అందువల్ల ప్రజలు కాచి చల్లార్చుకోని తాగాలని ప్రకటనలు ఇచ్చి అధికారులు చేతులు దులుపు కొన్నారు. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన బాధ్యతలను ఇంజనీరింగ్ అధికారులు విస్మరిస్తున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేర్వేరు ప్రాంతాలకు చెందిన 21 మంది గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఎక్కువమంది కడపునొప్పి, వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. వీరిలో శారదాకాలనీకి చెందిన ఎం.పద్మ(18) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. సంగడిగుంటకుచెందిన కొర్రపాటి ఓబులేసు (59) రెండురోజుల క్రితం అస్వస్థతకు గురై గురువారం మృతి చెందాడు. శారదాకాలనీ, సంగడిగుంట, ఆనంద్‌పేట, కమ్మ శేషయ్య భవన్, సుద్దపల్లి డొంక, శ్రీనగర్, ఎటి అగ్రహారం, బ్రాడీపేట, తదితర ప్రాంతాల్లో మున్సిపల్ నీరు తాగి పలువురు వాంతులు, విరోచనాలతో అస్వస్తతకు గురవుతున్నారు. శారదాకాలనీ, శ్రీనగర్‌కు చెందిన ఆరుగురు స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో చికిత్సపొందుతున్నారు. మరో 13 మంది వేర్వేరు అర్బన్ హెల్త్‌సెంటర్లకు వెళ్లి ప్రాథమిక చికిత్సపొంది డిశ్చార్జి అయ్యారని అధికార వర్గాలు తెలిపాయి. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి, మచిలీపట్నం ఎంపి వి.బాలశౌరి, సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సిపిఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, నగర కార్యదర్శి మాల్యాద్రి, వైసిపి గుంటూరు తూర్పు సమన్వకర్త నూరి ఫాతిమా, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షులు నేరెళ్ల సురేష్, టిడిపి నాయకులు బి.రామాంజనేయులు, చిట్టిబాబు, కె.శ్రీనివాసరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఉస్మాన్ పరామర్శించారు.

ఆస్పత్రిలో 20 మందికి చికిత్స

అస్వస్థతకు గురైన వారికి ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నట్లు గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. 21 మంది చికిత్సకు వచ్చారని, వారందర్నీ వార్డుల్లో చేర్పించి వైద్య సేవలు అందించామని చెప్పారు. సీరియస్‌గా ఉన్న బాదితులను ప్రత్యేక వార్డు కేటాయించి, నిత్యం వైద్యులు పర్యవేక్షణ ఉండేలా చేశామన్నారు. ప్రస్తుతం 20 మంది ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు.

చికిత్స పొందుతున్నవారి వివరాలు

పి.మస్తాన్‌రావు (మేడికొండూరు), టి.జయరావు (గురజాల), డి.వెంకటరమణ, మస్తాన్ బి, మహబూబ్ బి, కె.నాగేశ్వరి (శ్రీనగర్), ఎస్.గంగమ్మ (నెహ్రూనగర్), సయ్యద్ రజియా (సంగడిగుంట), షేక్ బాబు (మధునగర్), ఎం.సౌమ్య (అంగలకుదురు), షేక్ మహబూబ్ జానీ (శ్రీనగర్), టి.బాజీ (వట్టిచెరుకూరు), షేక్ షబానా (సండిగుంట), వి.ప్రసాదరావు (శారదాకాలనీ), ఎన్.శ్రీనివాసరావు (ఏటూకూరు), షేక్ నాగూర్‌బి (సిరిపురం), రమణ(కాకుమానువారితోట), పి.మంగమ్మ (నల్లచెరువు), పి.విజయబాబు (నల్లచెరువు), కె.వెంకటరమణ (సంపత్‌నగర్), షేక్ షబ్బీర్ (పేరేచర్ల).

ట్యాంకర్లతో నీటిసరఫరాకు కలెక్టర్ ఆదేశం

జిజిహెచ్‌లో బాధితులను జిలా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి పరామర్శించారు. కమిషనర్, వైద్య ఆరోగ్య శాఖాధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. వైద్యాధికారులు మరింత అప్రమత్తంగా వుండాలని బాధితులు ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యే వరకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. వాంతులు, విరోచనాలతో ఆసుపత్రిలో చేరిన పేషెంట్ల ప్రభావిత ప్రాంతాల్లో వాటర్ శాంపిల్స్ టెస్టు చేయించాలని, టెస్టు రిపోర్ట్ అందేవరకు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్‌కు సూచించారు. మెడికల్ అండ్ హెల్త్ టీములు ప్రభావిత కాలనీలలో ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేయాలన్నారు. వాంతులు, విరోచనాలతో ఎవరైనా ఇబ్బంది పడుతుంటే వారు డియం అండ్ హెచ్ ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము నంబర్ 6300115327 కు ఫోన్ చేసి తక్షణ సాయం పొందవచ్చని తెలిపారు.

మేయర్ వాహనాన్ని అడ్డుకున్న వామపక్ష నాయకులు

కలుషిత నీరు తాగి మృతి చెందిన పద్మ కుటుంబానికి ఎక్స్ గ్రేషియో చెల్లించాలని, చికిత్స పొందుతున్న మిగతా 21 బాధితులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. మేయర్ కావటిమనోహర్ నాయుడు కారును నిలిపివేసి తమ నిరసన తెలిపారు. కేవలం ఒక్క కుటుంబమో...ఒక్క ప్రాంతానికినీటి కాలుష్యం పరిమితం కాలేదని నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పడిన సమస్యను తక్షణమే పరిష్కరించాలని అన్నారు.

సహకార స్ఫూర్తితో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజల అవసరాలు ఆకాంక్షలకు అనుగుణంగా సహకార స్ఫూర్తితో ఆదర్శనీయమైన సేవలు అందిస్తున్న బ్యాంక్ విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ డైరెక్టర్ జె.వి సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం స్థానిక బ్యాంక్ ఆవరణలో బ్రాంచ్ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జె.వి సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సభ్యులే ఈ బ్యాంకుకు యజమానులుగా ఉన్నారన్నారు. దేశ చరిత్రలో 1514 సహకార బ్యాంకులున్నాయని, వాటిల్లో మెరుగైన సేవలందిస్తూ ఖాతాదారుల మన్నలను పొందుతూ నేటికీ 4వ స్థానంలో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ నిలిచిందని చెప్పారు. ఈ బ్యాంకు స్థాపించి 108 ఏళ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకుందని, రూ 500 కోట్ల సొంత నిధులతో 14 సొంత భవనాలతో విరాజిల్లుతూ ఒక్కరి కోసం అందరూ - అందరి కోసం ప్రతి ఒక్కరూ అనే సహకార సూత్రాన్ని చిత్తశుద్ధితో నమ్ముతోందని అన్నారు. బ్యాంక్ సభ్యులకు ప్రతి ఏటా లాభాలను డివిడెండ్ రూపంలో చెల్లిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ మంగళగిరి అధ్యక్షులు సంకా బాలాజీ గుప్తా, ది జనతా హ్యాండ్లూమ్ చేనేత సహకార సంఘం మంగళగిరి అధ్యక్షులు ఎం.సాంబశివరావు, శ్రీ మార్కండేయ చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు డి.నాగేశ్వరరావు, విజయలక్ష్మి చేనేత సహకార సంఘం మంగళగిరి మాజీ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు, టి.రమేష్‌బాబు, బి.వీరాంజనేయులు, జె.వరప్రసాద్, జోనల్ మేనేజర్ సిహెచ్‌విఆర్ సుబ్రహ్మణ్యం, బ్రాంచ్ మేనేజర్ కెవిపి ఫణి ప్రసాద్, ఖాతాదారులు పాల్గొన్నారు.

బోరు పని చేయదు... ట్యాపుల నుంచి నీరు రాదు

ప్రజాశక్తి-తాడేపల్లి : వేసవి రాకముందే తాడేపల్లి పట్టణంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ముగ్గురోడ్డులో వేల రూపాయలు ఖర్చు పెట్టి 200 అడుగుల లోతున వేసిన మంచినీటి బోరు పంపు పని చేయడంలేదు. సమీపంలో ఉన్న మున్సిపల్ ట్యాపు కూడా పని చేయడంలేదు. అటు బోరుపంపు... ఇటు మున్సిపల్ ట్యాపు ద్వారా నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడే ఇలాఉంటే మండు వేసవి ఏప్రిల్, మే నెలల్లో ఎంతగా కష్టాపడాల్సి వస్తోందనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల నుంచి ఈ ప్రాంతంలో తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదని, అధికారులు పట్టించుకోవడంలేదని బాధితులు వాపోతున్నారు. బోరు పంపు బాగు చేయడంతో పాటు మున్సిపల్ ట్యాపుల ద్వారా వస్తున్న తాగునీరు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

యడ్లపాడులో జెవివి చెకుముకి సైన్స్ సంబరాలు

(మొదటి పేజీ తరువాయి)

అలరించారు. ఇస్రో సైంటిస్టులతో మీట్ ది సైంటిస్ట్, ఇంటరాక్షన్ విత్ పేరెంట్స్ అండ్ టీచర్స్ వంటి కార్యక్రమాలు జరిగాయి. ఇస్రో - శ్రీహరికోట నుండి వచ్చిన స్పెషల్ వెహికిల్ ఎగ్జిబిషన్‌లో వివిధ రాకెట్ల మోడల్స్, అంతరిక్ష అంశాలపై ఫొటోలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎవివి ఎస్.స్వామి, సీనియర్ సైంటిస్ట్ (రిటైర్డ్) పి.జగదీష్ చంద్రరెడ్డి, ప్రొఫెసర్ మాల కొండయ్య, ఇస్రో సైంటిస్ట్ బి.శ్రీనివాసరావు, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష- ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్.ప్రసాదు, జెవివి రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాస్, ఎస్.ఎన్.రమేశ్, కెఎంఎంఆర్ ప్రసాద్, సిహెచ్.జయప్రకాష్, వైఎస్. నాగేశ్వర్, గోపాల్‌రావు, టి.సురేష్, స్కూల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, సృజన, కాళిదాసు పాల్గొన్నారు.

జిఎంసి నిర్లక్ష్యం వల్లే డయేరియా

(మొదటి పేజీ తరువాయి)

కాబట్టి మంచినీళ్ల కలుషితం కాలేదని, నగరపాల సంస్థకి ఎలాంటి బాధ్యత లేదని నగర మేయర్, కమిషనర్ చెప్పడం సరికాదన్నారు. తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి వాదన చేస్తున్నారని, మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. డయేరియా లక్షణాలున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. నగరవాసులకు శుద్ధ జలాన్ని అందించేలా నగర పాలక సంస్థ సత్వరమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డయేరియా బాధితుల ఆరోగ్య స్థితిపై జిజిహెచ్ సూపరెండేట్ కిరణ్ కుమార్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఖాసిం షహిద్, ఎస్.కార్తీక్, సిపిఐ నగర కార్యదర్శి మాల్యాద్రి నాయకులు అరుణ్,రమణ పాల్గొన్నారు.

7 క్వింటాళ్ల మిర్చి చోరీ

ప్రజాశక్తి-ఈపూరు

కళ్ళంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మిరపకాయలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన మండల కేంద్రమైన ఈపూరులో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన బాధిత రైతు మద్దం కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం 5.5 ఎకరాలలో మిర్చి సాగు చేశారు. మిర్చి కోత అనంతరం సుమారు 30 క్వింటాళ్ల మిరపకాయలను పొలం సమీపంలోని నాగార్జునసాగర్ ప్రధాన కుడి కాలువ కట్ట ప్రక్కన ఖాళీ ప్రదేశంలో కళ్ళం ఏర్పాటు చేసుకొని ఆరబోశాడు. వాటిలో సుమారు 10 క్వింటాళ్లు మిర్చి ఆరిన అనంతరం కూలీలతో మంచి, తాలు రకాలను వేరు చేయించి అమ్మకానికి సిద్ధం చేసుకున్నాడు. రోజు మాదిరిగానే శనివారం ఉదయాన్నే మిర్చి కళ్లం వద్దకు వెళ్లి చూడగా మిరప కాయలు తక్కువగా ఉండటం, దారి పొడవునా అక్కడక్కడ మిరపకాయలు పడి ఉండటం ఆ ప్రదేశంలో గోతాలు కనిపించడం గమనించడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. కాల్వకట్ట అవతలి వైపు ఆటోను ఉంచి గోతాల ద్వారా తరలించారని బాధిత రైతు తెలిపారు. చోరీ జరిగిన మిర్చి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని, ఆరు గాలం శ్రమించి పండించిన కష్టాన్ని దోచుకెళ్లారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబరావు తెలిపారు. పోలీసులు చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు.

ఈపూరులో మిర్చి చోరీ జరిగిన ప్రాంతం

చోరీకి వినియోగించిన గోతాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఎంఇఒ-1 పోస్టులను ప్రభుత్వ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఎంఇఒ-1 పోస్టులను త్వరితగతిన ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులచే భర్తీ చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ఎమ్మెల్సీ కల్పలతకు అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృత సమస్యకు ప్రభుత్వం ఎంఇఒ-2 పోస్టులు ఏర్పాటు చేసి పరిష్కారం చూపించిందని, అదే విధంగా ఎంఇఒ-1 పోస్టులను కూడా ప్రమోషన్లు చేపట్టి ప్రభుత్వ ఉపాధ్యాయులతో భర్తీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య, ఎమ్‌డి.ఖాసిం, వసుంధర, అబ్దుల్ ఖయ్యూం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

మాట్లాడుతున్న ఎల్ ఐసిఎఒఐ నాయకులు

ఏజెంట్లు ఐక్యతతో ఎల్‌ఐసిని కాపాడుకోవాలి

ప్రజాశక్తి-వినుకొండ

భారత ప్రభుత్వ రంగ సంస్థ ఎల్‌ఐసిలోనే ప్రజలు పెట్టుబడులు పెట్టేం దుకు ఏజెంట్లు కృషి చేయాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇం డియా (ఎల్ ఐసిఎఒఐ) రాష్ట్ర అధ్యక్షులు టి.కోటేశ్వర రావు అన్నారు. స్థానిక ఎల్‌ఐసి బ్రాంచ్ కార్యాలయంలో ఎల్‌ఐసి ఏఓఐ ఏజెంట్ల సర్వసభ్య సమావేశం సీనియర్ ఏజెంట్ ఎస్ కోటేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంస్థలో అనేక రకాల మార్పులు జరగనున్నాయని, వాటి వల్ల సంస్థ ప్రయోజనాలు దెబ్బ తినడంతో పాటు ఏజెంట్ల కు అనేక రకాల ఇబ్బందులు పడనున్నట్లు చెప్పారు. వాటిని ఎదుర్కొని సంస్థను కాపాడు కునేందుకు ఏజెంట్లు ఐక్యంగా ఉండాలని కోరారు. ఇప్పటికే అనేక రకాల పన్నులతో ప్రభుత్వాలు పాలసీదారులను ఇబ్బంది పెడుతున్నట్లు చెప్పారు. ఏజెంట్లకు ఇచ్చే గ్రాడ్యుటి లెక్కింపు విధానంలో మార్పులు తీసుకురావాలని,పాలసీదారుల ప్రయో జనాల దృష్ట్యా జీఎస్టీ ని ఎత్తివేసి బోనస్ ను పెంచాలని కోరారు. ఏవోఐ మచిలీపట్నం డివిజన్ వై. గాంధీ రామ్మోహన రావు, బ్రాంచ్ ఏబీఎమ్ వెంకటేష్ మాట్లాడారు. అనం తరం ఏబీ ఎన్ ను ఏజెంట్లు సత్కరించారు. అనంతరం ఏబీఎన్ ను ఏజెంట్లు సత్కరించారు.సమావేశంలో బ్రాంచి ఏవో ఐ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు, గల్లా సీతారామయ్య, పి శ్రీనివాసరావు, ఆర్జె నరసింహారావు, జి.నవీన్ కుమార్, పి.బ్రహ్మయ్య, ఎఐ రామ్మూర్తి, రాములు రెడ్డి లు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరి గింది. ఎల్ ఐసిఎఒఐ గౌరవాధ్యక్షు లుగా ఎస్.కోటేశ్వర రావు, అధ్యక్ష, కార్య దర్శులుగా బి.వెంకటేశ్వర్లు, ఎ.ఐరామ్మూర్తి, కోశాధికారిగా ఆర్జె నరసింహా రావును, మరో 9 మందిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు.

రైల్వే జోన్‌పై నాటకాలు కట్టిపెట్టండి

జెడిఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

విశాఖ రైల్వే జోన్‌కు భూమి ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుంటే.. ఇవ్వలేదని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని, రెండు ప్రభుత్వాలు ఇప్పటికైనా నాటకాలు కట్టిపెట్టాలని వక్తలు అన్నారు. జై ఆంధ్ర డెమెక్రటిక్ ఫోరం (జెడిఎఫ్) ఆధ్వర్యంలో శనివారం స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఒలో 'విభజన హామీలు–ఆంధ్రప్రదేశ్ రైల్వే ప్రాజెక్టులు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ వాల్తేరు రైల్వే డివిజన్ రద్దుచేసి విశాఖ రైల్వే జోన్ ప్రకటించడం అనేది విభజన చట్టం స్ఫూర్తికే విరుద్ధమని ఇది రాష్ట్ర ప్రయోజనాలకు, రైల్వే సమర్థ నిర్వహణకు వ్యతిరేక చర్య అని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జెడిఎఫ్ కార్యదర్శి, రైల్వే శాఖ విశ్రాంత ఉద్యోగి అవధానుల హరి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని నేషనల్ రైల్వే నెట్వర్క్‌లో అనుసంధానించేలా గుంటూరు–నెక్కల్లు -ఎర్రుపాలెం, అలానే పెదకూరపాడు నుండి నంబూరు, ఎర్రపాలెం రైల్వే లైనుకు డిపిఆర్ ఆమోదించిందని, 2017–18 రైల్వే బడ్జెట్‌లో రూ.కోటి కేటాయించి ప్రారంభించారని అన్నారు. కానీ బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయలేదన్నారు. జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు వ్యక్తులకు వేలాది ఎకరాలు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, విశాఖ రైల్వే జోన్‌కు 53 ఎకరాలు ఇవ్వడంలో సమస్య ఏమిటో అర్థం కావట్లేదన్నారు. విభజన హామీలు ప్రత్యేక హోదా కేజీ బేసిన్ గ్యాస్ 50 శాతం వాటా సాధించడంలో ఆంధ్రులంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునచిఆచరు. ఆప్ రాష్ట్ర ఉపా ధ్యక్షులు డాక్టర్ టి.సేవాకుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం, రైల్వే బడ్జెట్ విషయంలో ఎప్పుడూ మొండి చెయ్యే చూపిసోంతుందన్నారు. అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రానికి రావాల్సిన ప్రకటించిన రైల్వే ప్రాజెక్టులను సాధించుకునేందుకు రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి ఉండాలన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ ఛైర్మన్ టి.ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పెంచి, ప్యాసింజర్ రైళ్లను తగ్గించడం ద్వారా సామాన్య ప్రజలు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని చిన్న పార్టీలు సమస్యల గురించి పోరాడుతూ ఉంటే.. అధికార ప్రతిపక్ష పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు రాష్ట్రాన్ని పట్టించుకోవట్లేదని అన్నారు.

సమావేశంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి ఎల్.మురళీకృష్ణ, అమరావతి పరిరక్షణ సమితి రాజకీయేతర జేఏసీ కన్వీనర్ పి.వి.మల్లికార్జునరావు, డిబిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ ప్రసంగించారు.

సమావేశంలో మాట్లాడుతున్న అవధానుల హరి

పౌరహక్కుల సంఘం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మంగళగిరి : పౌర హక్కుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా మహా సభలను ఈ నెల 18వ తేదీన మంగళగిరి నగరంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పౌర హక్కుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు నరసింహారావు తెలిపారు. మహాసభల పోస్టర్ ను మంగళగిరి నగరంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ కోటేశ్వరరావు, ఉపా ధ్యక్షులు ప్రభాకర్, జాయింట్ సెక్రెటరీ చిన్నా,కార్యవర్గ సభ్యులు మంజుశ్రీ,గోపీనాథ్ పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - మంగళగిరి: మంగళగిరి పట్టణంలో మద్యం అక్రమ విక్రయాలు చేస్తున్నా రన్న పక్కా సమాచారంతో నిఘా ఏర్పాటు చేసి 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రుద్రు రాంబాబు అనే వ్యక్తి అమ్మకాలు చేస్తుండగా అతని వద్ద నుంచి 17 క్వార్టర్స్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టణ సిఐ ఎం.శ్రీనివాసరావు ఆదేశాలతో ఎస్సై శ్రీనివాస్ సమాచారంతో తన సిబ్బందితో కలిసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ మహేంద్ర చెప్పారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీ దర్శి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

IP NO : 7/2022

శ్రీపతి కోటయ్య .... పిటీషనరు

వర్సెస్

కోరుకొండ శ్రీను వగైరాలు ... రెస్పాండెంట్

To

R17) బెల్లం నరసింహారావు తండ్రి కోటయ్య R/o కోటసెంటర్, నరసరావుపేట టౌన్, పల్నాడు (జిల్లా)

R18) రేగుల సూరిబాబు తండ్రి బుల్లబ్బాయి R/o అస్సాపురం రోడ్డు, నూజెండ్ల గ్రామం, మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు పిటీషన్‌లో, పిటీషనరు పిటీషను పరిహారం కోరుచూ మీపై పైకోర్టులో దివాలా దరఖాస్తు దాఖలు చేసినందున సదరు పిటిషన్ లో మీరు పై కోర్టులో తేదీ 19-02-2024 హాజరై మీ ఆక్షేపణలు తెలుసుకొనవలసినది. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

వాయిదా తేది: 19-02-2024

// కోర్టు వారి ఉత్తర్వులతో //

ఇట్లు

వేరేశి రమణారెడ్డి

పిటిష నరు తరపు అడ్వకేట్

దరశి, ప్రకాశం జిల్లా

సెల్:9441275441.

NOTICE

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT GUNTUR

C.C No: 136/2023

BETWEEN :

Vetcha Venkata Adilakshmi ...Complainant

and

M/s. Sree Sai,Enterprisesand Others ...Opposite Parties

To,

Opp.No-1: M/s. Sree Sai Enterprises, H.No.42, Gun Bazaar, Jagadish Nagar, Rasoolpoora, Secunderabad, Hyderabad, Telangana, rep. by it's Jaganathpur Lokeshwari.

Opp.No-2:M/s. Sree Sai Enterprises, rep. by its Authorized Person,Nune Laxman@Laxmaiah, resident of H.No.23645/4/A/85, Prem Nagar, Amberpeta, Hyderabad, Telangana.

Opp.No:-3: M/s. Sree Sai Enterprises, rep. by its Authorized Person-D.Sailaja GMC Door No.22-19-1309/1, Ward No.4, 3rd Line, Postal Colony, near AlaHospital,Amaravathi Road,Guntur City,Guntur Dt.

పైనెంబరు C.C లో 1 నుండి 3 ఆపోజిట్‌పార్టీలు అయిన మీకు గౌరవ కమీషన్ వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున గౌరవ కమీషన్ వారు మీకు నోటీసును Subsituted Service ద్వారాపేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:23-02-2024న ఉ.గం.10-30 ని. లకు పై తెలిపిన శ్రీయుత కమీషన్ వారి యెదుట మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడ మైనది.

(శ్రీయుత కమీషన్ వారి అనుమతితో)

వాయిదా తేది:23-02-2024.

లంకా విజయ కుమార్,లంకా వంశీ కృష్ణ,

కంప్లైనెంట్ తరపు అడ్వకేట్స్, రవీంద్రనగర్ గుంటూరు,సెల్: 90305 95227

ఒరిజనల్ డాక్యుమెంట్, లింక్ పోయినవి

గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామ పరిధిలోని రామ్స్‌స్నేహ ఎవిన్యూ అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నెం–504, **డాక్యుమెంట్ నెం.2352/2016** ను చింతా కొండలరావు తండ్రి వెంకటరత్నం అను నేను 2016 సం॥లో కొనుగోలు చేసి, 504 ఫ్లాట్‌లో నివాసం ఉన్నాను. జనవరి 6, 2024 సం॥ నేను ఫ్లాట్ ఖాళీ చేసి, వేరేచోటకు ఇంటిసామాను తరలించే క్రమంలో నేను కొనుగోలు చేసిన ఫ్లాట్ నెం.504, **డాక్యుమెంట్ నెం.2352/2016** ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినవి. కావున నా యందు దయవుంచి ఎవరికైనా నా డాక్యుమెంట్ దొరికిన యెడల **నా మొబైల్ నెం.9885526666 కు** ఫోన్ చేసి తెలుపగలరని మనవి.

ఇట్లు

చింతా కొండలరావు.

IN THE COURT OF THE DEPUTY REGISTRAR OF CHITS, GUNTUR

DISPUTE NO: 122/2022

Between:

M/S Margadarsi Chit Fund Pvt.Ltd,Rep by its Senior Manager, Arundalpet Branch, Guntur. ...DISPUTANT

AND

MR.V.PRASAD & Others ...OPPONENTS

Opponent No:1

Mr.Vallangi Prasad, S/o Lakshmi Narayana, Editor, Samraksha Society, Sushil Nagar, Kotappakonda(V), Narasaraopet(M), Guntur Dist.

Opponent No:2

Mrs.Kommathoti China Subbayamma, W/o V.Prasad, Staff Nurse, Govt.General Hospital, Guntur.

Opponent No:3

Mrs.Kurapati Prabhavathi, W/o R.Kiran Kumar, Staff Nurse, Govt.General Hospital, Guntur.

Opponent No:4

Mrs.Yajali Kiran Kumari, W/o M.Divakar, Staff Nurse, Rims Hospital, Ongole on deputation working in Govt.General Hospital, Guntur.

Opponent No:5

Mrs.Manda Samson, S/o Kotaiah, Sr.Asst., O/o D.D., B.C.Welfare Dept., Z.P.Compound, Guntur.

Please take notice that the above dispute is filed against opponents for recovery of amount. The Opponent Nos.1 to 5 are not take the court notices from Hon'ble Deputy Registrar of chits, Guntur. Hence the suit is posted to 20-02-2024 for appearance of you before the Deputy Registrar of Chits, Guntur at 10-30 AM by person or through an Advocate. If you are fail to attend so, the matter will be heard and decided exparte basis on the material available.

(By the Order of the Hon'ble Deputy Registarar of Chits, Guntur)

Hearing Date:20-02-2024

FOREMAN/SR.BRANCH MANAGER
M/S Margadarsi Chit Fund Pvt Ltd.,
Arundalpet Branch, Guntur,
9618771325, 9885181858.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

'తిరుమల ఇంజినీరింగ్' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

జొన్నలగడ్డలోని స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో కోయంబత్తూరు కు చెందిన కన్సెంసుస్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్యూలలో తమ కళాశాలకు చెందిన వివిధ బ్రాంచ్ ల విద్యార్థులు 23మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వై వి నారాయణ శనివారం తెలిపారు. బుధవారం నిర్వహించిన ఈ ఇంటర్యూవలో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం గర్వకారణంగా ఉందని అన్నారు. కన్సెంసుస్ కంపెనీ ప్రతినిధి మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.3 లక్షల వేతనం ఇస్తామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను, అధ్యాపకేతర సిబ్బందిని కళాశాల యాజమాన్యం కళాశాల కరస్పాండెంట్ ,సెక్రటరీ రావెల సత్యనారాయణ, కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, వైస్ చైర్మన్ బత్తిన నాగేశ్వరరావు, కోశాధికారి దండా బ్రహ్మానందం, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ సాంబశివరావు అభినందించారు.

'లయోల' గోల్డెన్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి-వినుకొండ

స్థానిక లయోల హై స్కూల్ లో రెండు రోజుల పాటు జరిగే గోల్డెన్ జూబ్లీ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు నిర్వహించిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు జీవి ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. చదువు మనిషి జీవన గమనాన్ని మారుస్తుందని వారు అన్నారు. విద్యతో కలిగే ప్రయోజనాలను గుర్తించిన ఈ విద్యా సంస్థ వెనుకబడిన ప్రాంతంలో చదువులమ్మ ఒడికి పునాది వేసిందని, నాడే విశాలమైన ప్రాంగణంలో ఉన్నత పాఠశాల నిర్మించిందని అన్నారు. విద్యతో పాటు క్రీడలకు ఈ పాఠశాలకు పేరు ఉందని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, అమెరికా,కెనడా దేశ విదేశాల నుండి గత 50 సంవత్సరాలుగా పదో తరగతి అభ్యసించిన విద్యార్థినీ విద్యార్థులు తరలి వచ్చారు. వేడుకల్లో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. క్లాసికల్ డాన్స్ , పిరమిడ్ ఆకారంలో ఏర్పడ్డ విద్యార్థులు ఆకట్టుకున్నాయి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ పాల్గొన్నారు.

నిర్మించబోయేది భవనం కాదు ఉద్యమ శిక్షణా కేంద్రం

- యుటిఎఫ్ పల్నాడు జిల్లా భవన నిర్మాణ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- మెరుగైన మెగా డీఎస్సీ సాధన, అప్రెంటీస్ విధానం రద్దు కోసం పోరాటం : యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నిర్మించ తలపెట్టిన యుటిఎఫ్ పల్నాడు జిల్లా భవనం ఇసుక,ఇటుక, సిమెంట్ భవనం అని భావించకుండా ఉద్యమ శిక్షణ కేంద్రంగా భావించాలని, త్వరితగతిన ఈ నిర్మాణం చేపట్టి రాష్ట్రస్థాయిలో యుటిఎఫ్ సమావేశం ఏర్పాటు చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక పల్నాడు రోడ్ లోని ఎస్ ఎస్ ఎన్ కళాశాల ఆడిటోరియంలో శనివారం యుటిఎఫ్ పల్నాడు జిల్లా భవన నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానికి యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి .ప్రేమ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల సమ స్యల పరిష్కారం కోసం పాటుపడుతున్న యుటిఎఫ్ తమ కార్యచరణ రూపొందించుకునేందుకు ఉద్యమ బలాన్ని అందించే శిక్షణ కేంద్రాలుగా భావించాలన్నారు. యూటీఎఫ్ కు సంబంధించి ఏ కార్యక్రమం రూపొందించినా రూ 25 వేలు విరాళం ఇవ్వడం జరుగుతుందని, పల్నాడు జిల్లా పై ఉన్న

సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ ఉపాధ్యాయులు

ప్రత్యేక అభిమానంతో యుటిఎఫ్ జిల్లా కార్యాలయ నిర్మాణానికి రూ 1 లక్ష విరాళం అందజేయనున్నట్లు ఎమ్మెల్సీ ప్రకటించారు.

పల్నాడు ప్రాంతంలో సౌక ర్యాల లేమితో ఉపాధ్యాయులు పనిచేసేం దుకు విముఖత చూపుతున్నా రని ఆయా ప్రాంతాలలో పనిచేసేందుకు యు టి ఎఫ్ ఉపాధ్యాయులు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన పల్నాడులో అక్షరాస్యత శాతం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నక్క వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏడాది జాబు క్యాలెండర్ విడుదల చేస్తానని హామీ ఇచ్చి ఒక జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేయలేదని సిఎం జగన్‌ని విమర్శించారు. రాష్ట్రంలో 25 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే నాడు-నేడు పేరుతో పాఠశాల భవనాలను ఆధునికరించిన ప్రభుత్వం ఉపాధ్యాయులు లేకుండా విద్య రంగం ఎలా బలోపేతం అవుతుందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అప్రెంటీస్ వ్యవస్థ రద్దు కోసం అవసరమైతే ఉపాధ్యాయ సంఘాలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తా మని హెచ్చరించారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ మాట్లా డుతూ కేవలం ఉపాధ్యాయుల సమస్యల కోసం నాణ్య మైన విద్యా వ్యవస్థ కోసం యుటిఎఫ్ పోరాటాలు చేయడం లక్ష్యం కాదన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలు సమస్యలు పరిష్కారానికి ఉపాధ్యాయులు తమ వంతు పాత్ర పోషించాల్సిన ఆవశ్యకత ఉంద న్నారు. ఇటీవల అంగన్వాడీలు ఆశా వర్కర్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఇతర స్కీం వర్కర్లు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం చేస్తున్న పోరాటాలకు మద్దతు తెలపడంతో పాటు ఆర్థిక సహాయం చేయడం జరిగిందని గుర్తు చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేసే ఏ పోరాటానికైనా యుటిఎఫ్ మద్దతు తప్పనిసరిగా ఉంటుందని వివరించారు.

ఇటీవల పదవి విరమణ పొం దిన యుటిఎఫ్ ఉపా ధ్యాయులను యుటి ఎఫ్ పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం భవన నిర్మాణానికి ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా తమ వంతు విరాళాలను ప్రకటించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి, జిల్లా సహాధ్యక్షులు ఎం.మోహనరావు, జిల్లా సహాధ్యక్షురాలు ఏ. బాగేశ్వరి దేవి, జిల్లా కోశాధికారి, జె. వాల్యానాయక్, యుటిఎఫ్ నాయకులు ఎం సుందర్రావు వై.శ్రీనివాస రావు మల్లికా బేగం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - క్రోసూరు

ఆల్ ఇండియా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆమంచి విజ్ఞాన కేంద్రంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు అధ్యక్షతన శనివారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆవుల ఆంజనేయులు మాట్లాడుతూ భూ హక్కుల చట్టం 27/23 ఉపసంహరించుకొని చుక్కల భూములు, బంజర భూములన్నింటికి పట్టాలు కూడా ఇవ్వాలని, అటవీ హక్కుల చట్ట సవరణను ఉపసంహరించుకొని, ఆదివాసీల హక్కులు కాపాడాలని , సమగ్ర పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని అన్నారు. సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఏపూరి వెంకటేశ్వర్లు మాట్లాడారు.సమావేశంలో రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు కంచేటి పెద్దబ్బాయి, సిఐటియు క్రోసూరు మండల కార్యదర్శి గర్నేపూడి మహేష్, రైతు సంఘం అచ్చంపేట మండల కార్యదర్శి రావెళ్ల వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు షేక్ ముస్తఫా, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఇశ్రాయేలు , ఆటో యూనియన్ నాయకులు జగన్నాథం ,వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు పి.అశోక్ పాల్గొన్నారు.

మొరాయిస్తున్న సర్వర్లు.. లబ్ధిదారుల ఇక్కట్లు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. పట్టణంలో ఉన్న 29 సచివాలయాల్లో ఏ ఒక్క సచివాలయంలోను సర్వ ర్లు సక్రమంగా పనిచేయడం లేదు. గంటల తరబడే కాక,రోజుల తరబడి, కూలీ పనులు మానుకుని రిజిస్ట్రేషన్ కోసం సచివాలయాలు చుట్టూ తిరగాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. జగనన్న కాలనీలలో ఇచ్చిన పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియలో గుండు సూదంత సాయం కూడా వాలంటీర్లు చేయడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఒక్క సచివాలయాల్లోనే కాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సాధారణంగా జరిగే 20,30 రిజిస్ట్రేషన్లు సైతం మందకొడిగా సాగుతున్నాయి. అందులోనూ ప్రైమ్ 2.0 పద్ధతి లో జరిగుతుండటంతో సాంకేతిక సం స్యలు సహజంగానే తలెత్తుతున్నాయంటున్నారు. పావు,అర గంటలో జరగాల్సిన రిజిస్ట్రేషన్లు గంటలు, రోజులు పడుతున్నాయి. చిలకలూ రి పేటలో ప్రస్తుతం కన్వేన్స్ డీడ్ విధా నం లో పేదలకు ఇళ్ల పట్టా రిజిస్ట్రేషన్ చేస్తున్నామని సిబ్బంది చెబుతున్నారు. ముఖ్యంగా సచి వాలయ సిబ్బందికి సరైన అవగాహన లేకపోవడంతో కొత్త సమస్యలు, ఇ బ్బందులు తలెత్తుతున్నాయంటున్నారు. చాలాచోట్ల ఈ సైన్ వేలిముద్రలు పడటం లేదు. వీటిని పరిష్కరించడంలో సంబంధిత శాఖ ఘోరంగా విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి. వాలంటీర్లు పూనుకుని రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలని,పేదలు, నిరుపేదలను ఇబ్బందులకు గురి చేయకుండా

చూడాలని, ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని రిజిస్ట్రేషన్లు త్వరగా జరిగేలా చూడాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దుగ్గిరాల రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు.. తాడేపల్లిలో సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

నల్ల చట్టాల అమలుకు కేంద్రం కుట్ర

- ప్రజావ్యతిరేక విధానాలపై 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె
- జయప్రదానికి ప్రజా సంఘాల పిలుపు
- పలుచోట్ల ప్రచారం, నోటీసులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నరేంద్ర మోడీని గద్దె దించాలని కోరుతూ ఈనెల 16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ బందును, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. శనివారం దుగ్గిరాలలోని పసుపు మర్చంట్ హాల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి రైతుసంఘం మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు అధ్యక్షత వహించగా అప్పారావు మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా ఆందోళనలు చేపట్టినట్లు చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపరచకుండా మోసగించిందని, వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్తు, అటవీ సంపదలను, రవాణా, బ్యాంకులు, ఎల్ఐసి, రైల్వే, పోర్టులు తదితర సంస్థలన్నీ ఆదానీ అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పచెబుతున్నారని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీ లాభాలకు ఆటంకంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. రైతు ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దుచేసి మరొక రూపంలో వాటిని అమలు చేస్తోందని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలిచ్చిన ప్రభుత్వం నిత్యావసర వస్తువులన్నిటి పైనా జిఎస్టి పేరుతో పన్నులు పెంచిందని ఆవేదన వ్యక్తంచేశారు. బిజెపి విధానాలతో రైలులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు లక్షన్నర మంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. విభజన చట్టం హామీల అమలులో రాష్ట్రాన్నీ బిజెపి దారుణంగా మోసం చేసిందన్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తోందని, రాజ్యాంగా హక్కులను కాలరాస్తోందని, ఈ నేపథ్యంలో జరిగే ఆందోళనల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె.బాలరాజు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగమల్లేశ్వరరావు, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు కె.వెంకటేశ్వరరావు, కౌలురైతు సంఘం నాయకులు బి.అమ్మిరెడ్డి, పోతురాజు పాల్గొన్నారు.

మంగళగిరిలో సంతకాలు సేకరిస్తున్న ఎయిమ్స్ ఆటో యూనియన్

ప్రజాశక్తి - మంగళగిరి

బంద్, సమ్మె జయప్రదం కోసం ఎయిమ్స్ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. పట్నంలోని పలు ఆటో స్టాండ్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సంతకాల సేకరించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రమాదకర క్రిమినల్ చట్ట నిబంధనలపై పోరాడాలని నాయకులు ఉద్ఘాటించారు. ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఎంవి సుబ్బారావు, షేక్ ఖాజా, ప్రకాష్, రఫీ, కోటేశ్వరరావు, రాము, శ్రీనివాస్, రవి, ధన, రషీద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

తాము సమ్మెలో పాల్గొంటున్నట్లు తపట్టణంలోని వివిధ కంపెనీలకు ట్రేడ్ యూనియన్ నాయకులు నోటీసులు అందజేశారు. బిర్లా ఆదిత్య, మోర్ కంపెనీ, టిటి యార్డు ముతా కాంట్రాక్టర్స్, ఇమ్మిన్స్, బయోమెట్రిక్, ఇంపాక్స్ మందుల తయారీ కంపెనీ, మహాలక్ష్మి లారీ ట్రాన్స్‌పోర్టు, సెంట్రల్ వేర్ హౌస్, హిందుస్థాన్ పెట్రోలియం, సర్వో ఆయిల్ కంపెనీ మేనేజర్లకు కరపత్రాలు, సమ్మె నోటీసులు అందజేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు, ఎఐటియుసి నాయకులు టి.వెంకటయ్య, ఐఎన్‌టియుసి, ఐఎఫ్‌టియు, ఎఐఎఫ్ టియు, ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీను, కె.ఆదినారాయణ, ఎం.చెన్నయ్య పాల్గొన్నారు.

తహశీల్దార్ కెవి గోపాలకృష్ణకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - చేబ్రోలు

ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన బదిలీల్లో భాగంగా చేబ్రోలు తహశీల్దార్‌గా పని చేస్తున్న కెవి గోపాలకృష్ణ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ, పలు అవార్డులు పొందిన తీరును గుర్తు చేసుకుని అభినందనలు తెలిపారు. తహశీల్దార్‌గా ఆయన ఇక్కడకు వచ్చిన రెండు నెలల్లోనే సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న 12వేల అర్జీలను పరిష్కరించారని పలువురు ప్రజలు కొనియాడారు. తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ మాట్లాడుతూ అందరి సహకారంతో సమర్థవంతంగా సేవలు అందించినందుకు సంతృప్తిగా ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఇ.రమాదేవి, నాగిరెడ్డి, ఎస్.శ్రీకాంత్ కేథార్‌నాథ్, ఎంపిడిఒ బి.బాబురావు, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

తెనాలిలో స్మార్ట్ సిగ్నలింగ్ వ్యవస్థ ప్రారంభం

ప్రారంభోత్సవంలో చల్లా రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తెనాలి

సామాజిక బాధ్యతతో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని సిసిఎల్ ప్రొడక్ట్స్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఆయన స్థానిక ఎమ్మెల్యే ఎ.శివకుమార్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార దృక్పథమే కాకుండా తనపై సామాజిక బాధ్యత ఎంతో ఉందని, అందుకే సిగ్నల్స్ ఏర్పాటుకు సహకరించానని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో 8 ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ప్రజల చిరకాల స్వప్నం ఫలించింది

పట్టణ ప్రజల చిరకాల స్వప్నం ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు ఫలించిందని ఎమ్మెల్యే శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు. స్మార్ట్ సిగ్నలింగ్ వ్యవస్థ ప్రారంభానంతరం స్థానిక కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ సిగ్నల్స్ ఏర్పాటుకు సహకరించిన సిసిఎల్ ప్రొడక్ట్స్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పట్టణంలో ప్రధానమైన సమస్య ట్రాఫిక్ అని, దానిని అధికమించేందుకు స్మార్ట్ సిగ్నల్స్ ఏర్పాటు సుదీర్ఘ స్వప్నంగా చెప్పారు. అనంతరం సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, కమిషనర్ బి.శేషన్న, డీఎస్పీ బి.జనార్ధనరావు, ఎంవిఐ రాఘవరావు మాట్లాడారు. ట్రాఫిక్ వ్యవస్థపై విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు రాజేంద్రప్రసాద్ ద్వారా బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ టి.రాధిక, వైస్ చైర్మన్ ఎం.హరిప్రసాద్, ఎసిపి2 ఎల్.సుబ్బారావు, వైసిపి పట్టణా ధ్యక్షులు ఎం.శేషాచలం, ఈరే మినిస్ట్రీస్ అధినేత బిషప్ సుధీర్‌కుమార్, ఎంఈవో-2 జయంతిబాబు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో చల్లా రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి దుగ్గిరాల

మండల కేంద్రమైన దుగ్గిరాలలోని బాలికల హైస్కూల్ నుండి సుగాలి కాలనీ వైపు కొమ్మమూరు కాల్వపై రూ.70 లక్షల సొంత నిధులతో నిర్మించిన ఫుట్ బ్రిడ్జిని కాంటినెంటల్ కాఫీ ఫ్యాక్టరీ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. తమ ఫ్యాక్టరీలో పనిచేసే వంద కుటుంబాల వారు ఇక్కడ నివసిస్తున్నారని, అందువలన దుగ్గిరాల తమ సంస్థలో భాగంగా భావిస్తున్నామని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఎం.హనుమంతరావు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.చిరంజీవి, సర్పంచ్ బాణావత్ ఖుషీభాయ్ మాట్లాడారు. ఎంపిపి డి.సంతోష రూపవాణి, జెడ్‌పిటిసి ఎం.అరుణ యార్డు చైర్మన్ షేక్ బాజీ, కంపెనీ మేనేజర్ ఎం.బలరాం వైసిపి నాయకులు బి.వెంకటేశ్వర నాయక్, షేక్ జానీబాష, ఐ.రమేష్, పి.మేరమ్మ దోస్త్ సభ్యులు ఎం.గాంధీ, జి.శ్రీనివాస్, జల వనరుల శాఖ డిఇ ఎన్‌కెవి ప్రసాద్, వనిత పాల్గొన్నారు.

సుచరిత వాహనాన్ని అడ్డుకున్న నిరసనకారులు

మెగా డీఎస్సీ కోసం ప్రదర్శన

ఎమ్మెల్యే సుచరితను అడ్డుకునే యత్నం

ప్రజాశక్తి - మంగళగిరి

మెగా డీఎస్సీ ప్రకటించాలని కోరుతూ శనివారం తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్, నిరుద్యోగ జెఎసి ఆధ్వర్యంలో మంగళగిరిలో నిరసన ర్యాలీ జరిగింది. మంగళగిరి కూరగాయల మార్కెట్ సెంటర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం నుండి మిద్దె సెంటర్ మీదుగా గౌతమ్ బుద్ధ రోడ్డు, పాత బస్టాండ్ సెంటర్ మీదగా అంబేద్కర్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ చేశారు. ఇదే సమయంలో అటువైపు వెళుతున్న మాజీ హోంమంత్రి సుచరిత వాహనాన్ని టిఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, నిరుద్యోగ జెఎసి కార్యకర్తలు చుట్టుముట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయినా వాహనాన్ని ఆపకుండా వెళ్లారు. సుచరిత వాహనాన్ని పంపించే క్రమంలో పోలీసుల్లో ఒకరికి స్వల్ప గాయమైంది. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు ఆర్.సాయికృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, జె.కిరణ్‌చంద్, పి.మహేష్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆర్.కిరణ్, పి.జీవన్, జి.కిరణ్, ఎస్.గోపికష్ణ పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న మురళీకాంత్, గీతాకాంత్, ప్రకాశరావు

నెహ్రూ నికేతన్ స్వర్ణోత్సవాల విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బోస్‌రోడ్డులోని నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల సర్ణోత్సవాలు విజయంతంకావడాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంద్, వ్యవస్థాపకులు ప్రకాశరావు దాసరి ర్యాలీ ప్రారంభించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ బోస్-రోడ్, గాంధీచౌక్, మెయిన్‌రోడ్, గంగానమ్మపేట, రజకచెరువు, లక్ష్మీడీలక్స్ కూడలి మీదుగా తిరిగి పాఠశాలకు చేరుకుంది. మురళీకాంత్ దాసరి మాట్లాడుతూ విద్యాసంస్థలు స్థాపించి, 50 ఏళ్లు నిర్విఘ్నంగా నిర్వహించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇంతవరకూ యాజమాన్యానికి వెన్నంటి నడిపించిన విద్యారులు, వారి తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కీళ్ల నొప్పులు, కీళ్లవాతంపై నేడు ఆరోగ్యసభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో నేడు ఉదయం 11 గంటలకు కీళ్ల నొప్పులు, కీళ్లవాతం, సోరియాసిస్ అలెర్జీలపై అరండల్‌పేట 15/1లోని అవగాహన కార్యాలయంలో ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ మానుకొండ మురళీకృష్ణ ప్రధాన వక్తగా పాల్గొంటారన్నారు. ఈ మధ్య బాగా పెరిగిపోయిన రుమటాయిడ్ ఆర్థరైటిస్, స్పాండిలైటీస్ తదితరాల గురించి వివరించటంతోపాటు సందేహాలు నివృత్తి చేయడం జరుగుతుందని, ఆరోగ్యలాభిలాషులు అందరూ పాల్గొనాలని శివరామిరెడ్డి కోరారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మండల పరిధిలోని కంభంపాడు గ్రామ మాజీ సర్పంచ్ ఆదూరి దశరథ రామారావు 20 వ వర్ధంతి సందర్భంగా దశరథ రామారావు కుమారులు సోమశేఖర్, శివ, ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదూరి శివ, సోమశేఖర్ మాట్లాడుతూ తమ తండ్రి జ్ఞాపకార్థం కంభంపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎన్. మేరీ ప్రశాంతి,మాజీ సర్పంచ్ ఆరికట్ల చంద్రశేఖర్ రెడ్డి,పాశం బుగ్గ మల్లారెడ్డి,కావూరి రామస్వామి,డి. ఫ్రాన్సిస్ కొనతం బ్రహ్మ రెడ్డి,అన్నపురెడ్డి సంజీవ్ రెడ్డి,కిన్నెర రవి, కారుమంచి రాఘవేంద్ర, కాశీబోయిన రమేష్ పాల్గొన్నారు.



వైసిపి నుంచి టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళకు చెందిన వైసిపి నేత కోమెరా శ్రీను ఆధ్వర్యంలో 20 కుటుంబాలు వారు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టిడిపి ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, టిడిపి నేతలు ఎం.రామచంద్రరావు, బి. వెంకటస్వామి, డి.సాంబయ్య, సిహెచ్ మోహన్‌బాబు, ఎ. శ్రీను, ఎం.రామ సైదులు, ఎం.భాస్కర్, పాల్గొన్నారు.

పివి నరసింహారావుకు 'భారతరత్న'పై హర్షం

భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు కు భారత దేశ అత్యున్నత పురస్కారానికి ఎంపిక చేయడంపై కన్నా లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తంచేశారు. సత్తెనపల్లి లో శనివారం కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగుజాతి గౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసి, భారతదేశ ఆర్థిక అభివృద్ధికి కృషి చేసిన నరసింహారావును ఈ పురస్కారానికి ఎంపిక చేయడం యావత్ తెలుగు ప్రజలు గర్వించదగ్గ విషయమన్నారు.

'అసమర్థ ముఖ్యమంత్రిని సాగనంపుదాం'

ప్రజాశక్తి-సత్తెనపల్లి

అసమర్థ ముఖ్యమంత్రిని సాగనంపుదామని సత్తెనపల్లి పట్టణంలోని ప్రజా వేదికలో తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధులు కంబాల వెంకటేశ్వరరావు. ఆళ్ల సాంబయ్య. పి.వెంకట కోటయ్య. డి.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ . ముఖ్యమంత్రిగా అవినీతికి, పక్షపాతానికి వొడికట్టి, ప్రతిపక్షాలపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసి మరొకసారి ప్రజల ముందుకు వస్తున్న ఈ అసమర్థున్ని సాగనంపుదాం అన్నారు. సమావేశంలో అధికార ప్రతినిదులు దివ్వెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ఏర్పాట్లు, ఓటరు క్లెయిమ్ పరి ష్కారం అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ ఎల్.శివశంకర్ పాల్గొన్నారు. సమావేశానికి ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఆర్డీవోలు, తహశీల్దార్లు హాజరయ్యారు. వారి వారి నియోజకవర్గాల పరిధిలో చేపట్టిన ఎన్నికల ప్రక్రియ గురించి వివరించారు. నూతన యువ ఓటర్ లు కార్డులు, చనిపోయిన వారి ఓటర్ల వివరాలు, ఫామ్ 6, ఫామ్ 7,8 వివరాలు, తదితర ఓటర్ల వివరాలను ఎలక్షన్ సీఈవోకు తెలియ జేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, ఎఆర్ఒలు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.జిల్లా ఎన్నికల సమాచారాన్ని కలెక్టర్ అందించారు. నియోజకవర్గాల పరిధిలో చేపట్టిన ఎన్నికల ప్రక్రియ గురించి కలెక్టర్‌కు అధికారులు వివరించారు. నూతన యువ ఓటర్ లు కార్డులు, చని పోయిన వారి ఓటర్ల వివరాలు, ఫామ్ 6, ఫామ్ 7,8 వివరాలు, తదితర ఓటర్ల వివరాలను ఎలక్షన్ సీఈవోకు తెలియజేశారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

వెన్నాదేవి లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి జనసేన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వరికపూడిసెల ప్రాజెక్టును పూర్తి చేస్తామని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవి ఆంజనేయులు చెప్పారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం రాత్రి జరిగింది. కార్యక్రమంలో జీవి ఆంజనేయులు, సత్తెనపల్లి నియోజకవర్గ,టిడిపి ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ, గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నర్సరావుపేట టిడిపి ఇన్‌ఛార్జి చదలవాడ అరవిందబాబు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టిడిపి జెండా ను ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జీవి ఆంజనేయులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఒక్క పంటకు కూడా సాగు నీరు విడుదల చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. ఆయకట్టుకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో గోదావరి పెన్నా నదుల అనుసంధానానికి చంద్రబాబు భూమి పూజ చేసి విడుదల చేస్తే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు ను పట్టించుకోకుండా పల్నాడు, ప్రకాశం జిల్లాలకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టిడిపి జనసేన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఓట్లు వేసి గెలిపించాలని యువతను కోరారు.

'ఎమ్మెల్యే అవినీతి రోజుకొకటి చొప్పున బయట పెడతా'

ప్రజాశక్తి - నరసరావుపేట

మాట్లాడుతున్న చదలవాడ అరవిందబాబు

ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి భూ ఆక్రమణలపై తాను చేసిన ప్రతీ ఆరోపణకు ఆధారాలు ఉన్నాయని నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. ఎమ్మెల్యే భూ దందాపై స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే భూ కుంభకోణం బయట పెడుతుండటంతో తనపై అనేక కేసులు పెట్టారని , ఎన్ని కుట్ర కేసులు పెట్టినా ,కుతంత్రాలు పన్నినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గోపిరెడ్డి అవినీతిని బయటపెట్టి గద్దె దించడమే తన అంతిమ లక్ష్యమన్నారు. ఉప్పలపాడు రోడ్డులో సాయి బాలాజీ వెంచర్ మాటున గోపిరెడ్డి బినామి కాజావలి 45 ఎకరాల ప్రభుత్వ భూమిని అమ్మి సొమ్ము చేసుకున్నారని, ఈ 45 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఎన్ఎస్‌పి నీటి భూములు ఆరు ఎకరాలు,బండ్ల దారి తొమ్మిది ఎకరాల 50 సెంట్లు, కుంట పోరంబోకు భూమి ఆరు ఎకరాలు, మిగులు భూమి 14 ఎకరాలు, కుమ్మరి, మంగలి,చాకలి ఇనాం భూములు 16 ఎకరాలు, సాయి బాలాజీ వెంచర్ లో ప్రభుత్వ భూమి ఉందని వాటికి సంబంధించిన ఆర్ హెచ్ కాఫీ,ఆర్ ఎస్ ఆర్ పత్రాలను చూపించారు. సాయి బాలాజీ వెంచర్ లో దేవదాయ భూములను కూడా ఎమ్మెల్యే అమ్ముకొని సొమ్ము చేసు కున్నారని ఆరోపించారు. సాయి బాలాజీ వెంచర్‌లో 45 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎకరం ఐదు కోట్ల చొప్పున అమ్ముకున్నారని ఆ భూమికి సంబం ధించిన సర్వే నంబర్లు 175 - 210ఎ ఆధారాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాలేదని, తాను కబ్జా చేయలేదని చెబుతున్న ఎమ్మెల్యేకి చిత్తశుద్ధి ఉంటే నరసరావుపేటలో ఉన్న ప్రభుత్వ భూముల పై విచారణ జరిపించి ఎన్ని ఎకరాల ప్రభుత్వ భూమి ఉందో చెప్పాలని అరవిందబాబు సవాల్ విసిరారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై నిజనిర్ధారణ కమిటీ వేసి కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో,ప్రతిపక్ష నాయకులను కమిటీ సభ్యులుగా ఉంచి, విచారణకు జగన్‌ప్రభుత్వం నుంచి అనుమతిని ఎమ్మెల్యే మంజూరు చేయించగలరా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అవినీతి,అక్రమాలు రోజుకు ఒకటి చొప్పున బయట పెడతానని మీడియా ముఖంగా ప్రజలకు తెలియజేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బారావు,పట్టణ ప్రధాన కార్యదర్శి జి.శేఖర్,మైనార్టీ నాయకులు మీరావలి, మాబు,రఫీ,బీసీ నాయకులు పి.బసవేశ్వర రావు, కె.గంగాధర్ పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

విజయపురిసౌత్‌లోని బయ్యారం సమీపంలో ఉన్న సేవలాల్ కీమాలాల్ జంక్షన్ వద్ద శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని ప్రభుత్వ విప్,మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం సంద ర్శించారు. స్థానిక ఆలయంలో ఈ నెల 17 న సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతి వేడుకలను నిర్వహించనున్న సందర్భంగా ఎమ్మెల్యే పిన్నెల్లికి ఆలయ ధర్మకర్త కె.పాండు నాయక్ ఆహ్వాన పత్రికను అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కెపి గూడెం సర్పంచ్ పాండు నాయక్,వైసిపి ఎస్టీ సెల్ అధ్యక్షుడు బ్రహ్మానాయక్,అపోలో హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ రవీందర్,పాండు నాయక్ పాల్గొన్నారు.

నూతన చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

స్థానిక గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చి అభివృద్ధికి కృషి చేస్తానని మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి అన్నారు. శనివారం జరిగిన గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చి 13 వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చి 50 సంఘాల అబివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు. గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చి వార్షికోత్సవ వేడుకలకు ప్రతి ఏడాది హాజరువుతున్నట్లు చెప్పారు. ముందుగా గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చి ఆవరణలో నూతన చర్చి నిర్మాణానికి డాక్టర్ రెవరెండ్ దానియేలు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. అనంతరం దానియేలు ప్రసంగించారు. కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ చైర్మన్ చిన్న ఏసోబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు,మాజీ జడ్పీటీసీ శేరెడ్డి గోపిరెడ్డి, వైసిపి నాయకులు బూడిద శ్రీను, ఎంద్ర గాలయ్య, సిస్టర్ దానియేలు,విశ్రాంత డి ఈ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు,శ్రీనివాసరావు,మాజీ సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య,తంగిరాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

14న ఎంపి అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్ రాక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రానున్న సార్వత్రిక ఎన్నికలలో నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్న మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఈ నెల 14 న నరసరావుపేట రానున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. శనివారం గుంటూరు రోడ్డులోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామం నుండి భారీ ర్యాలీగా వెళ్లి అనిల్ కుమార్ యాదవ్‌కు స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. ర్యాలీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్న పల్నాడు బస్టాండ్ వరకు కొనసాగుతుందన్నారు. నరసరావుపేట పార్లమెంట్ స్థానం నుండి అనేక మంది ప్రముఖులు పోటీ చేసి ఉన్నత పదవులు అధిరోహించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. చరిత్ర కలిగిన నరసరావుపేట పార్లమెంట్ స్థానానికి మొట్టమొదటి సారి బిసి అభ్యర్థికి కేటాయించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బిసిలపై తమకున్న చిత్తశుద్ధి చాటారన్నారు. రానున్న ఎన్నికల్లో బిసి అభ్యర్థి అనీల్ కుమార్ యాదవ్ ను గెలిపించి పార్లమెంట్ కు పంపాలన్నారు. భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కు భారతరత్న ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

నరసరావుపేట డీఎస్పీగా విఎస్ఎన్ వర్మ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నరసరావుపేట డిఎస్పిగా వి.ఎస్.ఎన్ వర్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన డిఎస్పి వర్మ మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల కల్పనకు అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. గతంలో కొవ్వూరు డిఎస్పిగా, విజయవాడ టాస్కోఫోర్స్ క్రైమ్ విభాగంలో పని చేశానని చెప్పారు. ఇప్పటి వరకు నరసరావుపేట డిఎస్పిగా విధులు నిర్వహించిన కెవి మహేష్ గుంటూరుకు బదిలీ అయ్యారు.

సాంకేతికతను అవసరం మేరకే ఉపయోగించాలి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

డిజిటల్ టెక్నాలజీ వల్ల ఎన్ని ఉపయోగాలుంటాయో అన్ని చెడు ప్రభావాలూ ఉంటాయనేది స్పష్టమవుతోందని, యువత డిజిటల్ టెక్నాలజీని అవసరాల మేరకే ఉపయోగించాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన హెల్త్ సైకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.పద్మజ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్తంగా వర్సిటీలో నిర్వహిస్తున్న మూడ్రోజుల అంతర్జాతీయ సదస్సు శనివారం రెండో రోజు కొనసాగింది. పద్మజ మాట్లాడుతూ యుక్త వయసు పిల్లల మానసిక స్థితిపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ సైకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ స్వాతి మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ యువతపై చూపించే అనుకూలతలు, ప్రతికూలతలను వివరించారు. డిజిటల్ టెక్నాలజీ యొక్క ప్రతికూలతను తగ్గించుకోవడానికి తల్లిదండ్రులు,

అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఉపాధ్యాయులు వివిధ మార్గదర్శకాలను పాటించాలన్నారు. అమెరికా నుంచి పాల్గొన్న పీటర్ విగ్ మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ ఒక తరం నుంచి మరొక తరానికి ఎంత ప్రభావం చూపిస్తుందో వివరించారు. మానసిక ఆరోగ్యాన్ని కాపాడే విధానాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సదస్సులో ఇండోనేషియా, ఉగాండా, బాంగ్లాదేశ్, వెస్ట్ ఆఫ్రికా, కాంగో తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు పరిశోధన పత్రాలను సమర్పించారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ నాగరాజు, కన్వీనర్ డాక్టర్ టిడి విమల, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎం.వసంతరావు, సైకాలజీ విభాగం అధ్యాపకులు, స్పందన ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శ్యామ్యూల్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్సిటీ టూరిజం విద్యార్థులకు పతకాలు

ఒంగోలులోని క్విస్ కళాశాలలో ఈనెల 7, 8, 9 తేదీల్లో జరిగిన వార్షికోత్సవ పోటీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ టూరిజం ట్రావెల్ మేనేజ్మెంట్ విద్యార్థులు పతకాలు సాధించారని విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణచంద్రరావు తెలిపారు. ఎకో టూరిజం అంశంలో ప్రథమ బహుమతి సాధించారన్నారు. ఎక్స్ పో విభాగంలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ టూరిజం, ట్రైబల్ అంశాలో నిర్వహించిన పోటీలలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. మొదటి బహుమతి సాధించిన విద్యార్థులకు రూ.12,500 నగదు బహుమతితో పాటు ధ్రువపత్రాలు వచ్చాయి. వీరిని వీసీ పి.రాజశేఖర్, రెక్టర్ పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణలు అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న బిసి సంఘం నాయకులు

టిడిపిలో బీసీలకు ప్రాధాన్యం పెరగాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

టిడిపిలో బీసీలకు మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని బీసీ సంఘం నాయకులు అన్నారు. శనివారం రాజధాని ప్రాంతం తుళ్లూరులో బిసి సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. నాయకులు జి.రాజుస్వామి, టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడిపికి వెన్నుముక లాంటి బీసీల అభ్యున్నతికి పాటుపడే వ్యక్తికి తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసే అవకాశం కల్పించాలని చంద్రబాబును కోరారు. అభిప్రాయ భేదాలున్నా టిడిపిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని, చంద్రబాబు ఎంపిక చేసిన అభ్యర్థి విజయానికి టిడిపి, జనసేన శ్రేణులు ఐక్యంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు జి.నాగేశ్వరరావు, ఎం.వెంకటేష్, ఎ.నరేంద్ర, జి.శివయ్య పాల్గొన్నారు.

గుంటూరు ఎంపి టిక్కెట్ కోసం దరఖాస్తు

ప్రజాశక్తి - తుళ్లూరు

గుంటూరు పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ అమరావతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మినేని సురేష్‌బాబు దరఖాస్తు చేసుకున్నారు. శనివారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో ఎపిసిసి పరిశీలకులకు ధరఖాస్తు అందజేశారు. రాజధాని ప్రాంతం తుళ్లూరుకు చెందిన తాను వైసిపి తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్స్ పార్టీ తరపున పనిచేశానని, 30 ఏళ్లుగా పార్టీలో నిబద్ధతతో పని చేస్తున్నాని చెప్పారు.

దరఖాస్తు ఇస్తున్న సురేష్‌బాబు

కాంగ్రెస్ పార్టీలో చేరిక

ప్రజాశక్తి - మంగళగిరి : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం స్థానిక బాప్టిస్ట్‌పేటకు చెందిన కంతేటి తేజ ఆధ్వర్యంలో వందమంది ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు కంటేటి జీవన్ సాగర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో షేక్ సలీం, కె.రాధిక, ఆర్.హనుమంత రావు, కె.కృష్ణారావు చౌదరి పాల్గొన్నారు. తేజ పుట్టినరోజు సందర్భంగా కేక్‌ను కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

క్రాఫ్ ఆధ్వర్యంలో బాల మేళా ఆటల పోటీలు

ప్రజాశక్తి - తెనాలి

చైల్డ్ రైట్స్ అడ్వొకసి ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో బాలమేళా పేరిట శనివారం అనుమర్లపూడిలో పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. క్రాఫ్ కో-ఆర్డినేటర్ జి.వెంకట్ మాట్లాడుతూ బెలూన్ గేమ్, లక్కీ సర్కిల్ గేమ్, న్యూమరికల్ గేమ్, గ్లాస్ అండ్ వాటర్ గేమ్, సర్కిల్ ఇన్ బాల్ గేమ్ క్రీడల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలుగా పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతి సెక్రటరీ పి.శ్రీకాంత్, గ్రామస్తులు కె సామ్యూల్ మాట్లాడుతూ బాలలకు ఏమైనా సమస్యలు ఎదురైతే

1098 చైల్డ్ హెల్ప్ లైన్‌కు, డయల్ 100 పోలీస్ వారికి, 181 ఉమెన్ హెల్ప్ లైన్‌కు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రాజకుమారి, సహజ , లక్ష్మి, స్రవంతి, క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ జయరాజు, లక్ష్మి తిరుపతమ్మ పాల్గొన్నారు.

తెలుగువారి హృదయాల్లో చిరంజీవి ఘంటసాల

గాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - తెనాలి

మధుర గాయకులు ఘంటసాల తెలుగు ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరంజీవి గానే ఉంటారని ఎఎన్‌యు సెనేట్ మెంబర్ డాక్టర్ కె.రామరాజు అన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డు వివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణ ఎవిఎస్ ఆడిటోరియంలో శనివారం ఘంటసాల వర్ధంతి నిర్వహించారు. పట్టణానికి చెందిన ఐఎస్‌సిఎఫ్, అభ్యుదయ కళా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు హరికథా భాగవతారిణి నాగమణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఘంటసాల పాటల పోటీలలో పలువురు ఘంటసాల మధుర గీతాలను ఆలపించారు. డాక్టర్ రామరాజు మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు, యువతకు కూడా మానసిక ఉత్తేజాన్ని ఇచ్చే శక్తి సంగీతానికి ఉందన్నారు. సినీ వినీలాకాశంలో పదివేలకు పైగా మధుర గేయాలను ఆలపించిన ఘంటసాల సంగీత ప్రపంచంలో ప్రజలను ఓలలాడించారన్నారు. పాటల పోటీలకు పెద్దిరాజు, నాగప్రసాద్ సంగీత సహకారం అందించారు. అభ్యుదయ కళా సమితి అధ్యక్షులు, వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు సినీ జగత్తులో ఘంటసాల ప్రస్థానాన్ని వివరించారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు, బొల్లిముంత కృష్ణ, లక్ష్మీ సుజాత పాల్గొన్నారు. పాటల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మాట్లాడుతున్న నందం అబద్ధయ్య

లోకేష్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

వచ్చే ఎన్నికల్లో నారా లోకేష్‌కు లక్ష ఓట్ల మెజార్టీ తెచ్చేందుకు ప్రణాళిక రూపొందించామని, అందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య పిలుపునిచ్చారు. స్థానిక జంపాల వారి కాంప్లెక్స్ శనివారం జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో లోకేష్ 29 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఇటీవల అనేకమంది పార్టీలోకి వచ్చారని, కొత్త, పాత తేడా లేకుండా కలిసి పనిచేయాలని కోరారు. సమావేశానికి టిడిపి మండల కార్యదర్శి టి.అశోక్ అధ్యక్షత వహించగా జి.వెంకటరావు, వి.శ్రీకృష్ణప్రసాద్, కె.శ్రీఅనిత, విజయలక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రజకులను ఎస్సీల్లో చేర్చాలని పాదయాత్ర

ప్రజాశక్తి-మంగళగిరి

రజక సంఘ నాయకులు నేషనల్ ధోబి మహాసంఘ్ జాతీయ అధ్యక్షులు ఎ.నాగమల్లేశ్వరరావు తిరుమల నుండి చేపట్టిన మహా పాదయాత్ర శనివారం మంగళగిరికి చేరింది. నేతన్న సర్కిల్ వద్ద బీసీ సంక్షేమ సంఘం, స్వర్ణకార సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. 18 రాష్ట్రాలలో ఎస్సీలుగా ఉన్న రజకులను ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎస్సీల జాబితాలో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఎస్సీ నాయకులు కె.ఉదయభాస్కర్, బీసీ నాయకులు కె.హనుమంతరావు, కె.స్వాతి గౌడ్, యు.శ్రీనివాసరావు, టి.కిరణ్, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన జెఎంజే విద్యార్థినులు

జెఎంజె విద్యార్థినులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక జెఎంజె మహిళా కళాశాల విద్యార్థినులు క్యాంపస్ సెలక్షన్లలో అధిక సంఖ్యలో ఉద్యోగాలు పొందారని ప్రిన్సిపల్ డాక్టర్ షైనీ శనివారం తెలిపారు. మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, శ్రీసిటీ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించగా డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థినులు 57 మంది శ్రీసిటీ డైకిన్ ఎయిక్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, తడలో ఉద్యోగాలకు, 85 మంది హీరో మోటో కార్పొరేషన్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్‌తోపాటు కరస్పాండెంట్ డాక్టర్ థెరేసమ్మ, వైస్ ప్రిన్సిపల్ శారద అభినందించారు. ఇంటర్వ్యూ ప్రక్రియలను ట్రెయినింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.సుధాకరయ్య పర్యవేక్షించారు.

80 మందికి కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలాల్లో 60 రోజుల కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 80 మంది మహిళలకు తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షులు ఆరుద్ర భూలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఎ.జయసత్య, ఐ.ఆశాబాల, ఎం.వైష్ణవి, యు.దుర్గా మల్లేశ్వరి పాల్గొన్నారు.

చైల్డ్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కోస్తాంధ్ర అధ్యక్షులు పల్నాటి నాగరాజు ఆధ్వర్యంలో శనివారం రక్తదానం చేశారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి, ప్రసవ సమయంలో జరిగే ఆపరేషన్లకు, అత్యవసర శస్త్ర చికిత్సలకు రక్తం అనివార్యమని, అందుకే రక్తదానం చేశామని చెప్పారు. హెడ్ నర్స్ సుజాత, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు మిషన్ రిపేర్‌పై శిక్షణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగంలో ఈ నెల 12న కుట్టు మిషన్ రిపేర్‌పై ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ శనివారం తెలిపారు. వర్సిటీ పరిసర ప్రాంతాల్లోని గ్రామాల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9848286477 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ 3వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ పి.రాజశేఖర్ శనివారం విడుదల చేశారు. బిఎ, బీకాం, బీఎస్సీ, బీసీఎ, బిబిఎం, బీఏఓఎల్, బిహెచ్‌ఎం పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షలు అదనపు నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్‌రావు తెలిపారు. పరీక్షలకు 14,969 మంది విద్యార్థులు హాజరుకాగా 10,191 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఫలితాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. ఫలితాలకు సంబంధించి సందేహాలుంటే రివాల్యుయేషన్‌కు ఈనెల 26వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1240 చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఫలితాలు విడుదలలో రెక్టార్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, డిగ్రీ పరీక్షల కో-ఆర్డినేటర్ సంధ్య కోల్, ఓఎస్‌డి కె.సునీత, సిటిఎలు, ఏసిటిఏలు పాల్గొన్నారు.

సిఎ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని ఎ.హిమబిందు

ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వారు ప్రకటించిన సిఎ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించారని మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. మాస్టర్ విద్యార్థిని ఎ.హిమబిందు 400 మార్కులకుగాను 347 మార్కులు సాధించి, ప్రతిభ కనబరిచినట్లు మోహన్ పేర్కొన్నారు. 400 మార్కులకు 300 ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు 36 మంది ఉన్నట్లు చెప్పారు. సుమారు వెయ్యిమంది మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ఈ ఫలితాలలో ఉత్తీర్ణత సాధించినట్లు మోహన్ తెలిపారు. మాస్టర్‌మైండ్స్ విద్యా సంస్థ అత్యుత్తమ బోధనా విధానం, క్రమశిక్షణ ఈ విజయానికి కారణమని అన్నారు. ఈ సందర్భంగా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

వైసిపిలో తొలగని గందరగోళం

వీక్షణం

ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో వైసిపి సమన్వయకర్తల నియామకం పార్టీలో తీవ్ర గందరగోళానికి దారితీసింది. మొదటి విడత జాబితాలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్థానంలో నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించిన గంజి చిరంజీవి పరిస్థితి ప్రస్తుతం డోలాయనంలో పడింది. చిరంజీవి అభ్యర్థిత్వంపై సర్వే చేసిన ఐ ప్యాక్ బృందాలు ప్రతికూల పవనాలే ఎక్కువగా ఉన్నాయని నివేదికలిచ్చాయి. చిరంజీవి స్థానంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల కూమార్తె, ఎమ్మెల్సీ మరుగుడు హనుమంతరావు కోడలు లావణ్య పేరును అధిష్టానం పరిశీలిస్తోంది.

ప్రత్తిపాడులోనూ అసమ్మతి ప్రారంభమైంది. ప్రస్తుత సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌కు కాకుండా మాల సామాజిక తరగతికి ఈ కేటాయించాలని శనివారం గుంటూరులో సమావేశమైన మాలల సమావేశం డిమాండ్ చేసింది. బలసాని కిరణ్‌కుమార్ స్థానికేతరుడుగా ప్రచారమవుతుండడంతో ఆయన్ను మార్చాలా? కొనసాగించాలా? అనే అంశంపై వైసిపి అధిష్టానం తర్జనభర్జన పడుతోంది.

రేపల్లెలో సమన్వయకర్త ఈపూరి గణేష్ అభ్యర్థిత్వంపైనా సానుకూలత రావడంలేదని సర్వేల్లో వెల్లడయినట్టు తెలిసింది. దీంతో ఇటీవల రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణతో సిఎం జగన్ ఈ అంశంపై చర్చించినట్టు తెలిసింది. మోపిదేవి సహకరించడం లేదన్న అనుమానంతో ఆయన చెప్పిన వారికే అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో సిఎం జగన్ ఉన్నారని ప్రచారమవుతోంది. గణేష్‌ను కొనసాగించండి... తన సహకారం ఉంటుందని అని మోపిదేవి నర్మగర్భంగా చెప్పినట్టు తెలిసింది.

పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు టిక్కెట్ విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. ఆయన్ను మార్చే అవకాశం ఉందని సీనియర్ నాయకుడొకరు అభిప్రాయపడ్డారు. కొద్ది రోజులు ఆగాలని అధిష్టానం చెప్పడంతో రోశయ్య కూడా నియోజకవర్గానికి వెళ్లడం తగ్గించారు. గుంటూరు లోక్‌సభకు రోశయ్య బావమరిది ఉమ్మారెడ్డి వెంకట రమణకు ఖరారు చేయడంతో రోశయ్య అభ్యర్థిత్వం పెండింగ్‌లో పడింది. ఒకే కుటుంబంలో ఇద్దరికి ఇవ్వడం కంటే పొన్నూరులో మరొకరికి ఇవ్వాలని యోచిస్తున్నారు. ఎవరిని పొన్నూరు వెళ్లమన్నా మాకొద్దు బాబోయ్ అంటున్నారని పార్టీలో ప్రచారం ఉంది.

రెండేళ్లుగా వైసిపికి జిల్లా ఇన్‌ఛార్జిగా ఉన్న ఆళ్ల అయోధ్య రామిరెడ్డిని కూడా ఇటీవల తప్పించారు. ఎంపి విజయసాయిరెడ్డికి గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం బాధ్యతలు అప్పగించారు. అయోధ్యరామిరెడ్డి సోదరుడు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన పదవికి, వైసిపికి రాజీనామా చేసిన కొద్ది రోజులకే కాంగ్రెస్‌లో చేరారు. దీంతో అయోధ్యరామిరెడ్డి పరిస్థితి ఇరకాటంలో పడింది. అంతేకాకుండా వీరిద్దరి సమీప బంధువు మోదుగుల వేణుగోపాలరెడ్డికి ఉమ్మడి జిల్లాలో ఎక్కడా పోటీ చేసే అవకాశం కల్పించలేదు. 2019 ఎన్నికల్లో వైసిపి తరుపున గుంటూరు లోక్‌సభ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈసారి పల్నాడు జిల్లాలో ఏదో ఒక అసెంబ్లీ నుంచి అవకాశం కల్పిస్తామని పార్టీ అధిష్టానం హామీ ఇచ్చినా సామాజిక సమీకరణల్లో ఆయనకు అవకాశం దక్కలేదు.

పల్నాడు జిల్లాలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అసమ్మతి బావుటా ఎగుర వేశారు. తనకు పార్టీలో తగిన గౌరవం, గుర్తింపు లేదని, సిఎం జగన్ ఏడాదిన్నర అపాయిమెంట్ ఇవ్వడంలేదని అసమ్మతి రాజకీయాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై విమర్శల వాగ్బాణాలను సంధిస్తున్నారు. సత్తెనపల్లిలో కూడా మంత్రి అంబటి రాంబాబుకు వ్యతిరేకంగా అసమ్మతి రాజకీయాలు ఊపందుకుంటున్నాయి. అంబటికి టిక్కెట్ కొనసాగింపుపై పార్టీలో ఇంకా సందిగ్ధం లేకపోలేదు.

చిలకలూరిపేటలో మంత్రి విడదల రజిని స్థానంలో సమన్వయకర్తగా నియమితులైన మల్లెల రాజేష్ నాయుడు అభ్యర్థిత్వంపై కూడా ఐప్యాక్ సర్వే చేస్తున్నట్టు తెలిసింది. వినుకొండలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వైసిపికి గుడ్‌బై చెప్పారు. టిడిపిలో చేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు వైసిపిని వీడి టిడిపిలో చేరేందుకు సిద్ధమయ్యారు. శ్రీకృష్ణదేవరాయలు స్థానంలో నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను నరసరావుపేట లోక్‌సభకు సమన్వయకర్తగా నియమించారు. దీనిద్వారా బిసి కార్డుతో ఏడు నియోజకవర్గాల్లో లబ్ధి పొందాలని వైసిపి వ్యూహరచన చేస్తోంది.

(ఎ.వి.డి.శర్మ)

కొండవీడు కోటపై పండగ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా, చిలకలూరిపేట

యడ్లపాడు మండలంలోని కొండవీడు కోటపై రెండ్రోజులపాటు నిర్వహించే కొండవీడు ఫెస్ట్-2024 శనివారం ప్రారంభమైంది. వసంతరాజీయం వేదికగా జరిగిన ఫెస్ట్‌ను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ ప్రారంభించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా హెలికాప్టర్ రైడ్‌తోపాటు పలు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులు, కళాకారులు, జబర్దస్త్ టీం, పలువురు నాటకాల రచయితలు, ఉద్యోగుల ప్రత్యేక ప్రదర్శనలు, పాటలు, నృత్యాలు ఆలరించాయి. నిర్విరామంగా సాగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలతో పర్యాటకులు సందడిగా గడిపారు. లేజర్ షో, పల్నాడు జిల్లా ఉత్సవ గీతం ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా హెలి రైడ్‌కు సంబంధించి టికెట్టు ధర పెద్దవారికి రూ.3,800, పిల్లలకు రూ.3500 నిర్ణయించారు. ఫెస్ట్‌కు పల్నాడు జిల్లాతోపాటు గుంటూరు, బాపట్ల, ఎన్‌టిఆర్, కృష్ణా, ప్రకాశం జిల్లాల నుండి పర్యాటకులు తరలివచ్చారు. విద్యార్థులు ఎక్కువగా వచ్చే అవకాశం నేపథ్యంలో చిన్నపిల్లల కోసం ప్లే ఏరియాను ఏర్పాటు చేశారు. పూల తోటలతో పాటు ఇసుకను ఏర్పాటు చేయించి అందులో సైతక శిల్పం తరహాలో ఆర్ట్ గీసేలా ఏర్పాటు చేవారు. ప్రత్యేక వేదికలపై క్లాసికల్, వెస్ట్రన్ నృత్య ప్రదర్శన పోటీలు పెడుతున్నారు. ప్రథమ బహుమతి రూ.10,116, ద్వితీయ బహుమతి రూ.5,116, తృతీయ బహుమతులు రూ.2.500 ఇవ్వన్నుట్లు కలెక్టర్ ప్రకటించారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలలో శాస్త్రీయ దృక్పథం కల్పించటమే కళాజాతా లక్ష్యమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.మురళీధర్ పేర్కొన్నారు. శనివారం అడవితక్కెళ్లపాడులోని ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్‌కు జెవివి సైన్స్ జాతా వచ్చింది. ఈ సందర్భంగా జరిగిన సభలో మురళీధర్ మాట్లాడుతూ ప్రజల్లో మూఢనమ్మకాలు, పర్యావరణం, మద్యపానం, లింగసమానత్వం, అందరికీ ఆరోగ్యం మొదలైన విషయాల్లో కళారూపాలు, పాటలు, మ్యాజిక్ ద్వారా అవగాహన కల్పించటం కోసం శ్రీకాకుళం నుండి అనంతపురం వరకూ కళాజాతా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ జాతకాలు, తాయత్తులు, రంగురాళ్ల ఇలా అనేక రూపాలలో ప్రజల్ని మోసం చేస్తున్నారని, వీటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి.జాన్‌బాబు, నాయకులు టి.ఆర్.రమేష్, చాందిని, ఎస్.కె.అహ్మద్ హుస్సేన్, ఎన్.తాండవకృష్ణ, ఎల్.ఎస్.భారవి, ఇ.అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

గత ఎన్నికల్లో మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా కోరారు. శనివారం స్థానిక ఎపిజిఇఎ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో చాంద్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించి జిపిఎస్ తెచ్చిందన్నారు. ఉద్యోగ విరమణ తరువాత పాత పెన్షన్ ఉద్యోగికి రూ.100 లబ్ది చేకూరితే, సిపిఎస్ ఉద్యోగికి రూ.25 మాత్రమే లబ్ధి చేకూరుతుందని టక్కర్ కమిటీ రిపోర్ట్‌లో తేల్చారన్నారు. పాత పెన్షన్ వల్ల ప్రభుత్వంతో జీవితాంతం సంబంధం ఉంటుందని, ఏడాదికి రెండు డిఎలు, ఐదేళ్లకు ఒకసారి పిఆర్‌సితో పెన్షన్ పెంపు సౌలభ్యం, ఉద్యోగ విరమణ తర్వాత హెల్త్ కార్డులు వర్తిస్తాయియని, జీవితాంతం పెన్షన్, గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ తదితర సదుపాయాలు ఉంటాయని వివరించారు. జిపిఎస్ ద్వారా షేర్ మార్కెట్ ఆధారిత పెన్షన్ అని, పదవీ విరమణ తర్వాత డిఎ, పిఆర్‌సి వర్తించవని, అనేక ముఖ్యమైన లోపాలు జిపిఎస్‌లో ఉన్నాయన్నారు. జిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు హుస్సేన్ ఖాన్, సంయుక్త కార్యదర్శి జి.శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి నాగభూషణం, జాను పాల్గొన్నారు.